సాక్షి
తిరుపతి
గురువారం । 19 । డిసెంబర్ । 2024





**అతిథి వసతి..దుర్గతి**
శ్రీకాళహస్తి ఆలయానికి వచ్చే భక్తులు బస చేయడానికి వసతి గదులు లేక ఇక్కట్లు పడుతున్నారు. - 8లో



**పోలీసు సేవలు ఇక సులభతరం**
పోలీసు సేవలు ఇకపై సులభతరం కానున్నాయని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. - 8లో



**రేషన్ బియ్యం స్వాధీనం**
సూళ్లూరుపేటలోని హోలీక్రాస్ సెంటర్ వద్ద 25 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

## న్యూస్‌రీల్

### అమ్మవారి సేవలో లక్షద్వీప్ గవర్నర్



తిరుచానూరులో లక్షద్వీప్ గవర్నర్ ప్రఫుల్ పటేల్

చంద్రగిరి: లక్షద్వీప్ గవర్నర్ ప్రఫుల్ పటేల్ బుధవారం సాయంత్రం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ప్రసాద్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### శాఖల వారీగా పురోగతి చూపాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: శాఖల వారీగా పురోగతి చూపాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై పురోగతి ఉండాలని స్పష్టం చేశారు. సమావేశాలు నిర్వహించి వెళ్లిపోతే ప్రయోజనం ఉండదని, ప్రగతి సాధిస్తేనే సమావేశాలకు ఫలితం ఉంటుందని స్పష్టం చేశారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ప్రధానంగా వ్యవసాయశాఖ హౌసింగ్, గ్రామీణాభివృద్ధి, డ్వామా, మత్స్యశాఖ పురోగతిపై సమీక్షించారు. డీపీఓ సుశీలాదేవి తోపాటు డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డీఏఓ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరు పోలీసులపై వేటు

తిరుపతి క్రైం : విధి నిర్వహణలో అలసత్వం వహిస్తూ నిర్లక్ష్యంగా ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం తెలిపారు. ఇందులో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి రవికుమార్– 1484 ఇతను సాయుధ దళంలో విధులు నిర్వహిస్తున్నారు. క్రమశిక్షణ తప్పి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయగా నిర్ధారణ అయ్యిందన్నారు. అలాగే పోలీస్ కానిస్టేబుల్ జి చంద్రయ్య–3586 నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈయన క్రమశిక్షణ లోపించి ప్రజల వద్ద దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. వీరిద్దరిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయగా ఇరువురు చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడినట్లు గుర్తించి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

అక్రమమా..సక్రమమా.. తర్వాత సంగతి.. గాలి ఉన్నప్పుడే తూర్పార పట్టాలన్నట్లుంది ఇసుకాసురుల పరిస్థితి. ఉచితం సాకుతో స్వర్ణముఖి నదిలో ఇసుక ఇష్టారాజ్యంగా తోడేస్తున్నారు. యథేచ్ఛగా సైకతాన్ని పొరుగు రాష్ట్రాలకు తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక వ్యాపారం అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. తనిఖీలు చేయాల్సిన అధికారగణం ఉదాశీనంగా వ్యవహరిస్తూ.. ముఖ్యనేత కనుసన్నల్లో మెలుగుతోంది.

# ఆగని సైఖత భోజ్యం



తొట్టంబేడు మండలం పెన్నలపాడు సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఇసుక తరలించడానికి వచ్చిన ట్రాక్టర్లు

**తరలిపోతున్న తెల్లబంగారం**

- రూ.కోట్లు గడిస్తున్న తెలుగు తమ్ముళ్లు
- అడపాదడపా నామమాత్రపు తనిఖీలతో నరిపెడుతున్న అధికారులు
- జేసీబీలు. ప్రొక్లెయినర్లతో టిప్పర్లకు లోడింగ్
- చెన్నై, బెంగళూరు నగరాలకు తరలుతున్న వైనం
- రేయింబవళ్లు ఆగని ఇసుక అక్రమ రవాణా
- తాజాగా రేణిగుంట మండలం పిల్లపాళెంలో 17 ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

రేణిగుంట: స్వర్ణముఖి నదిలో ఇసుకకు పొరుగు రాష్ట్రాల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. స్వర్ణముఖి నదిలో ఇసుకను దోచేసి, అక్రమార్జన చేస్తున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ముఖ్య నేత కనుసన్నల్లో ఈ అక్రమ వ్యాపారం రేయింబవళ్లు నిరాటంకంగా కొనసాగుతోంది. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. స్వర్ణముఖి నది సైకతం ఇసుకాసురులకు కాసుల పంటను కురిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో స్వర్ణముఖి నది పరివాహక గ్రామాల్లో టీడీపీ నేతలు తిష్టవేసి ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. ఇసుక దోపిడీపై ప్రజలు పలుసార్లు

**ఫిర్యాదులు చేసినా అధికారులు**

అధికార పార్టీకి కొమ్ముకాస్తూ అటువైపు కన్నెత్తి చూడకపోవటంతో ఇసుక దోపిడీ రేయింబవళ్లు నిరాటంకంగా కొనసాగుతోంది. ఈ ఇసుకాసురుల ధనదాహానికి రెండు నెలల కిందట శ్రీకాళహస్తి మండలంలో ఇసుక ట్రాక్టర్ వేగంగా వచ్చి తొక్కించడంతో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. అయినా నియోజకవర్గ ముఖ్యనేత కానీ, అధికార యంత్రాంగం కానీ ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయకపోవడం విశేషం. అయితే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో రేణిగుంట మండలం పిల్లపాళెం సమీపంలో మంగళవారం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి 17 ఇసుక ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేశారు.

**శ్రీకాళహస్తి ముఖ్యనేతతో తమిళ తంబి ఒప్పందం**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుక రీచ్‌లన్నీ తమవేనంటూ తమిళనాడుకు చెందిన ఓ బడా కాంట్రాక్టర్ నియోజకవర్గ ముఖ్యనేతతో లోపాయకారి ఒప్పందం కుదుర్చుకుని, అందుకు అనుగుణంగా రెవెన్యూ, పోలీసు అధికారులకు ఆదేశాలివ్వడంతో అనధికారిక రీచ్‌ల ద్వారా ఇసుక యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారు. చెన్నై, బెంగళూరులో 40 టన్నుల ఇసుక రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు పలుకుతుండడంతో పగలంతా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తిరుపతి తోపాటు, స్థానికంగా తరలించి చీకటి పడగానే రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు. ముఖ్యంగా రేణిగుంట మండలం పిల్లపాళెం, జీపాళెం, నల్లపాళెం, గాజులమండ్యం, కొత్రమంగళం, ఎస్ ఆర్ పట్టెడ గ్రామాల నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. అలాగే ఏర్పేడు మండలం పాపానాయుడుపేట, పెన్నగడం, మర్రిమంద, ఎండీ పుత్తూరు, చెల్లూరు, గోవిందవరం, మునగలపాళెం, కొత్తవీరాపురం గ్రామాల నుంచి స్వర్ణముఖి నది ఇసుకను తరలిస్తున్నారు. తొట్టంబేడు మండలం పెంకులపాడు, పొయ్య గ్రామాల నుంచి అనధికారిక ఇసుక రీచ్‌ల పేరుతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. శ్రీకాళహస్తి మండలం రామాపురం, మిట్టకండ్రిగ, వేడాం, తొండమనాడు, అమ్మపాళెం, బూరమానుకండ్రిగ తదితర గ్రామాల శివారున స్వర్ణముఖి నది నుంచి అనధికారికంగా ఇసుక తరలిపోతోంది. అయితే ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం మామూళ్ల మత్తులో అప్పుడప్పుడూ నామమాత్రపు తనిఖీలు చేసి, చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

**ప్రైవేటు భూముల్లోనూ ఇసుక తరలింపు**

రేణిగుంట, ఏర్పేడు మండలాల్లోని స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలోని ప్రైవేటు భూముల్లో ఇసుక నిల్వలున్నాయి. దీంతో ఇసుక వ్యాపారులు ఈ భూములను లీజుకు తీసుకుని, అక్రమంగా తవ్వకాలు జరిపి తరలిస్తున్నారు. దాదాపు 30 నుంచి 40 అడుగుల లోతు వరకు తవ్వి ఇసుకను తోడేస్తున్నారు. మనుషులతో కాకుండా జేసీబీ, ప్రొక్లెయినర్లతో ఇసుకను తవ్వి, తరలిస్తున్నారు. ప్రైవేటు భూముల్లో ఇసుకను తోడేందుకు అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా అవేమీ పట్టించుకోకుండా ఎక్కడపడితే అక్కడ బావులు, మగుడుల్లా తవ్వి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**ఉచితం సాకుతో రేయింబవళ్లు దోపిడీ**

కూటమి ప్రభుత్వం గృహావసరాలకు ఉచిత ఇసుక విధానాన్ని తీసుకుని రావడాన్ని ఆసరా చేసుకుని ఇసుకాసురులు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రేయింబవళ్లు జేసీబీ, ప్రొక్లెయినర్ల సాయంతో స్వర్ణముఖి నదిలో ఇసుకను తవ్వేసి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. దీంతో నదిలో పెద్ద పెద్ద బావులను తలపించేలా గుంతలు దర్శనమిస్తున్నాయి. కేవలం గృహావసరాలకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య సమీప సచివాలయం నుంచి అనుమతి రసీదు తీసుకుని ఎడ్లబండి, ట్రాక్టర్లు, మనుషుల సాయంతో మాత్రమే ఇసుకను నాలుగు అడుగుల లోతు వరకు తవ్వి, తీసుకెళ్లవచ్చని నిబంధనలు పెట్టారు. అయితే అందుకు భిన్నంగా ప్రొక్లెయినర్లు, జేసీబీల సాయంతో బావులు తలపించేలా ఇసుకను తోడి, టిప్పర్లు, లారీల్లో చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు తరలిస్తున్నారు.

**అక్రమార్కులపై చర్యలు**

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు పెట్టి శిక్షిస్తాం. స్వర్ణముఖి నదిలోకి ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా అక్కడక్కడా ట్రెంచ్‌లను తవ్వాం. కేవలం గృహ నిర్మాణ అవసరాలకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుంటే అనుమతి రసీదులు తీసుకుని మనుషుల సాయంతోనే ఇసుకను తీసుకుని వెళ్లేందుకు ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు.
– సురేష్‌బాబు, తహసీల్దార్, రేణిగుంట





రేణిగుంట మండలంలో స్వర్ణముఖి నదిలో ఇసుక తీసి, లోడ్ చేస్తున్న జేసీబీ, ఇసుక తోడేయడంతో ఏర్పడిన గుంత



రేణిగుంట మండలం పిల్లపాళెం సమీపంలో పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

## వ్యాసరచన, వక్తృత్వ పోటీలు రేపు

తిరుపతి సిటీ: జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా వినియోగదారుల వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 తేదీన డిగ్రీ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా వినియోగదారుల సమాచార కేంద్ర కన్వీనర్ పి రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీల్లో 'వినియోగదారుల వ్యవహారాలు, న్యాయపాలనకు వర్చువల్ విచారణ, డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై తిరుపతి జిల్లాస్థాయిలో తెలుగు, ఇంగ్లిషు మీడియంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నేరుగా వచ్చి పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.3 వేలు, రెండో బహుమతి రూ.2 వేలు, మూడో బహుమతి రూ.1500 నగదుతో పాటు సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 93936 20006 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## ఆ సీటు.. చాలా హాట్ గురూ!

- రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ సీటుకు భలే డిమాండ్
- రూ.2 కోట్లు ఇస్తే ఆ సీటు నీదేనంటున్న కూటమి నేత
- అడిగిన మొత్తం చెల్లించేందుకు పలువురు అధికారులు రెడీ



రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షి టాస్క్‌ఫోర్స్: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ సీటు కోసం అనేక మంది అధికారులు పోటీపడుతున్నారు. ఈ సీటు కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేసే అధికారుల వరకు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కోసం ఎంతైనా ముడుపులు చెల్లించేందుకు కొందరు అధికారులు సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అందు కోసం కూటమిలోని నాయకుల ద్వారా ముమ్మరంగా ప్రయత్నాలు ప్రారంభించారు. రాష్ట్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ప్రభుత్వానికి అధిక ఆదాయం వచ్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రేణిగుంట ప్రధానమైనది. రాయలసీమ వ్యాప్తంగా చూస్తే తిరుపతి జిల్లాలోని రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మొదటి స్థానంలో ఉంది. అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరిగేది ఇక్కడే. ఈ కార్యాలయానికి బదిలీ అయితే చాలు.. పనిచేస్తే అదే పదివేలు అని భావించే అధికారులు, సిబ్బంది కూడా ఉన్నారు. అందుకే ఈ కార్యాలయానికి ప్రాధాన్యత పెరిగింది. అటువంటి రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే అధికారి ఇటీవలే సస్పెండ్ అయ్యారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు అధికారులు, సిబ్బంది మామూళ్ల కోసం ఆశపడి నిషేధిత భూములు, కుంట, చెరువు, కాలువ పోరంబోకు భూములను సైతం పట్టా భూముల సర్వే నంబర్లు వేసి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. రాత్రి సమయంలో అధికంగా అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తడం, సాక్షి, ఇతర దినపత్రికల్లోనూ ఈ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాల గురించి వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ఉన్నతాధికారులు రేణిగుంటకు చేరుకున్నారు. ఏఐజీ ఉదయభాస్కర్ మూడు రోజుల పాటు జిల్లాలోనే తిష్టవేసి విచారణ జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్లపై సమగ్రంగా విచారించారు. ఆధారాలన్నీ సేకరించాక.. ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రాజేష్‌ని సస్పెండ్ చేశారు. త్వరలో మరి కొందరిపైనా వేటుపడే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలోనూ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఇప్పటికే ముగ్గురు అధికారులు సస్పెండ్ అయ్యారు.

**ఎంత ఇస్తావు?.. ఎంతైనా ఇస్తా!**

రేణిగుంట మండలంలో అనేక పరిశ్రమలు, విద్యాసంస్థలు ఉన్నాయి. అలాగే అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ఉంది. మండలం మొత్తం.. జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. అందుకే ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. భూముల మార్కెట్ విలువను ఆధారం రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇక్కడ పనిచేసే అధికారులు, సిబ్బంది కొందరు మామూళ్ల రూపంలో ఒకటి, రెండు శాతం డిమాండ్ చేసి తీసుకుంటారనే ఆరోపణలున్నాయి. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న రెండు పోస్టులు ఖాళీగా ఉండడంతో అధికారులు కొందరు ఎవరికి వారు నువ్వా.. నేనా? అని పోటీపడుతున్నారు. ఇక్కడి పోస్టింగ్ కోసం అధికారులు కొందరు వెళ్లి ప్రజా ప్రతినిధులను కలిస్తే.. ఎంతిస్తావు? అని అడుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎంత ఇవ్వటానికైనా సిద్ధమేనని ఇద్దరు అధికారులు ముందుకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. అందులో ఒకరు రూ.2 కోట్లైనా ఇస్తానని చెప్పినట్లు కార్యాలయంలోని అధికారులు చర్చించుకుంటున్నారు.

# తిరుపతి పవిత్రత గోవిందా..!

- పబ్ తరహా ఈవెంట్‌పై చర్యలు తీసుకోవాలి
- ఆధ్యాత్మిక నగరంలో ఏరులై పారుతున్న మద్యం
- సనాతన ధర్మ ప్రతినిధి పవన్ కళ్యాణ్ స్పందించాలి
- భూమన కరుణాకరరెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : ఆధ్యాత్మిక క్షేత్రంలో కూటమి ప్రభుత్వ అండదండలతో జరుగుతున్న పబ్‌కల్చర్ కారణంగా తిరుపతి పవిత్రత గోవిందా..అని ప్రజలు విసుక్కుంటున్నారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి పద్మావతిపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుచానూరు సమీపంలో పబ్‌ను తలపించేలా నిర్వహించిన ఈవెంట్‌లో మద్యం, మాదక ద్రవ్యాల వినియోగం జరిగిందనే వార్తలు కలిచివేస్తున్నాయన్నారు. తిరుపతిలో కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనతోనే ఇటువంటి దుష్ట సంస్కృతికి బీజం పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి పవిత్రతను కాపాడుతా.. నా ఇష్టదైవం వేంకటేశ్వరస్వామి అని పదే పదే చెప్పుకునే చంద్రబాబుకు తిరుపతిలో జరుగుతున్న ఆకృత్యాలు తెలియవా? అని ప్రశ్నించారు. కూటమి నాయకుల అండదండలతోనే తిరుపతి కార్పొరేషన్‌లోని ఓ అవినీతి అధికారి కుటుంబం నడుపుతున్న రెస్టారెంట్‌లో పబ్ కల్చర్‌తోపాటు మత్తు పదార్థాలు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయన్నారు. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా పబ్ కల్చర్ నిర్వహణ ఆందోళన కలిగిస్తోందన్నారు. దీనిపై నిత్యం పర్యవేక్షించాల్సిన పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారంటే అందుకు చంద్రబాబు మౌనమే కారణమన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుతానంటూ కొత్తగా అవతారమెత్తిన పవన్‌స్వామీజీ తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో కూటమి నేతల అండదండలతో నిర్వహిస్తున్న పబ్ కల్చర్‌పై స్పందించరా? అని ప్రశ్నించారు. తిరుపతి పవిత్రతను కాపాడేలా పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు నిఘా వ్యవస్థను పెంచాలని డిమాండ్ చేశారు.

**పబ్ తరహా ఈవెంట్‌కు అధికార పార్టీ అండ ఆందోళనకరం**

తిరుపతిలో పబ్ తరహా ఈవెంట్ల నిర్వహణ వెనుక అధికార పార్టీ అండదండలు ఉండడం ఆందోళనకరమని భూమన కరుణాకరరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నగరంలో మద్యం విచ్చలవిడిగా ఏరులై ప్రవహిస్తోందని మండిపడ్డారు. మద్యం దుకాణాలను ఉదయం ఏడుగంటల నుంచి రాత్రి పన్నెండు గంటల వరకు నడుపుతున్నా పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని? ప్రశ్నించారు. చివరికి తిరుపతిలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, అమ్మాయిలతో నృత్యాలు, డీజే పేరుతో పాశ్చాత్య సంగీతాలతో తిరుపతి ఔచిత్యాన్నే ప్రశ్నించేలా ఘటనలు ప్రారంభమయ్యాయంటే దానికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

**కక్ష సాధింపులతోనే దాడులు**

కేవలం వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్నవారిపై కూటమి నాయకులు కక్ష సాధింపులతోనే పాల్పడుతున్నారని భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరి నియోజకవర్గంలోని ఓ మారుమూల గ్రామంలో వైస్సార్‌సీపీ మద్దతుదారుని ఇంటి గడప పగలగొట్టడం ఆశ్చర్యమేసిందన్నారు. మారుమూల గ్రామంలో తహసీల్దార్, ఎంపీడీఓ, సీఐ స్థాయి అధికారులు వెళ్లి, ఇంటి గడప పగలగొట్టడంతో కూటమి నాయకుల కక్ష సాధింపులు ఏవిధంగా ఉన్నాయో తెలుస్తుందన్నారు. అలాగే శ్రీకాళహస్తిలో రివర్ వ్యూ రెస్టారెంట్ కూల్చడం కూడా కక్ష సాధింపేనన్నారు. కుప్పంలో సచివాలయం వద్ద ఉన్న శిలాఫలకాన్ని కూడ పగలగొట్టడం దుర్మార్గమన్నారు.

**ధర్మ పరిరక్షణ ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ సిద్ధం**

పాశ్చాత్య సంస్కృతిలో భాగంగా నూతన సంవత్సరం అర్ధరాత్రి జరిపే హంగామాను కూడా తిరుపతిలో జరగకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చర్యలు తీసుకున్నామని భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. చంద్రబాబు సీఎంగా అధికారం చేపట్టిన తరువాత ఆయన ఆదేశాలతోనే తిరుపతి పవిత్రతకు భంగం కలిగేలా కార్యక్రమాలు జరుగుతుంటే, ఈ నగరాన్ని ఇక ఆ భగవంతుడే కాపాడాలన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు అవతరించిన పీఠాధిపతి పవన్ కళ్యాణ్ ఈ ఘటనపై స్పందించాలన్నారు. తిరుపతి పవిత్రత కోసం ప్రజలతో కలిసి వైఎస్సార్‌సీపీ ఉద్యమాన్ని చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ నాయకులు బొమ్మగుంట రవి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బ్రహ్మర్షి ఆశ్రమంలో మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్



అష్టలక్ష్మి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్

**రామచంద్రాపురం:** మండలంలోని సి.రామాపురంలో ఉన్న బ్రహ్మర్షి ఆశ్రమంలో జరుగుతున్న అష్టలక్ష్మి ఉత్సవాల్లో బుధవారం మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆశ్రమంలోని దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురువానంద గురూజీ ఆశీస్సులు పొందారు. ఆశ్రమ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

### 22న క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు

**తిరుపతి అర్బన్ :** ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–12 బాయ్స్ క్రికెట్ సెలక్షన్ ఆదివారం (ఈనెల 22న) ఉంటుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయకుమార్, సెక్రటరీ ఎస్.రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు జోన్లలో ఉదయం 8 గంటల నుంచి సెలక్షన్ ఉంటుందని చెప్పారు. తిరుపతిలో సీవీ క్రికెట్ గ్రౌండ్, వాల్మీకిపురంలోని జీవీఎస్‌సీఎస్ క్రికెట్ గ్రౌండ్, చిత్తూరు పోలీస్ గ్రౌండ్‌లో ఈ ఎంపికలు ఉంటాయని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం సీడీసీఏ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సతీష్ యాదవ్ 88861 85559 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### 21 నుంచి లా కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

**తిరుపతి సిటీ :** పద్మావతి మహిళా వర్సిటీ లా విభాగం నిర్వహించే కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 21 నుంచి 27 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు విభాగాధిపతి మాధురి పరదేశి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ లాసెట్–2024, ఏపీ పీజీఎల్‌సెట్–2024 ఉత్తీర్ణులైన విద్యార్థినులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని పేర్కొన్నారు. లా విభాగంలో మూడేళ్ల, ఐదేళ్ల డిగ్రీ, రెండేళ్ల పీజీ కోర్సుల్లో ప్రవేశానికి అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నామన్నారు. అర్హులైన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్, టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలతో వర్సిటీలో సంప్రదించాలన్నారు.



# అతిథి వసతి..దుర్గతి

దక్షిణ కైలాసం..వాయులింగ క్షేత్రం.. పంచరామాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న శ్రీకాళహస్తి ఆలయం.. ముక్కంటి చెంత రాహుకేతు పూజల ప్రాశస్త్యం విశ్వవ్యాప్తం.. వెరసి.. నిత్యం తరలి వస్తున్న వేలాది మంది భక్తజనం.. వారికి వసతి కల్పించలేని స్థితిలో దేవస్థానం.. ఉన్న వసతి గృహాలు సైతం దుర్వినియోగం.. అయినా పట్టించుకోని అధికారగణం.. ఫలితం ప్రైవేటు లాడ్జీలు ఆశ్రయిస్తున్న వైనం.. ఇదీ శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న తతంగం.

- అతిథి గృహాల్లో డబ్బాలు నిల్వ
- అందుబాటులో లేని గెస్ట్‌హౌస్‌లు
- అధిక ధరలు వెచ్చించి అవస్థ పడుతున్న భక్తులు



శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంభిక సదన్ అతిథి గృహం

**శ్రీకాళహస్తి:** ముక్కంటి భక్తులు బస చేయడానికి వసతి గదులు లేక ఇక్కట్లు పడుతున్నారు. వాయులింగ క్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు వచ్చి, స్వామివారిని దర్శించుకుంటున్నారు. అయితే వారికి సౌకర్యాలు లేక అవస్థ పడుతున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతు పూజలు విశ్వవ్యాప్తంగా ప్రసిద్ధి పొందాయి. ఈ నేపథ్యంలో రోజుకు సుమారు 20 వేల నుంచి 30 వేల మంది వరకు భక్తులు విచ్చేస్తున్నారు. అయితే ఆలయంలో పనిచేసే కొందరు అధికారులు, సిబ్బంది రాహుకేతువులను మించి వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆలయానికి అపఖ్యాతి రావడమే కాకుండా, నష్టం వాటిల్లుతోంది. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిధిలో 12 అతిథిగృహాలు ఉన్నాయి. ఈ అతిథి గృహాల్లో గంగాసదన్, జ్ఞానప్రసూనాంబిక సదన్, వరదరాజస్వామి అతిథి గృహం, కైలాససదన్, భక్తకన్నప్ప సదన్, త్రినేత్ర అతిథి గృహం ముఖ్యమైనవి. వీటిలో సూట్‌రూమ్‌లు, ఏసీ రూమ్‌లు 88, 124 నాన్ ఏసీ గదులు, ఎనిమిది డార్మెంటరీలు అందుబాటులో ఉన్నాయి. ఈ గదు ల్లో సుమారు 700 మంది వరకు భక్తులు బస చేయవచ్చు. అయితే 20 వేల మంది భక్తులు ఆలయానికి వస్తుంటే 700 మందికి మాత్రమే ఆలయం వసతి కల్పించగలుగుతోంది. పదిశాతం మందికి కూడా ఆన్‌లైన్‌లో గదులు ఇవ్వలేని పరిస్థితి నెలకొని ఉంది. దీంతో భక్తులు అధిక ధరలు వెచ్చించి, ప్రైవేటు లాడ్జీలను ఆశ్రయించాల్సి వస్తోంది.

**ఉద్యోగులే గ్రహాలుగా..**

గతంలో ఓ ఈఓ జ్ఞానప్రసూనాంబ సదన్‌లో రెండు వీఐపీ సూట్‌లను తమ సొంత ఇల్లులా వాడుకున్నారు. ఓ ఇంజినీరింగ్‌శాఖ ఈఈగా పనిచేసిన ఓ అధికారి ఒకటిన్నర సంవత్సరం పాటు గదిన తన సొంతింటిలా వాడుకుని ఆలయానికి ఒక రూపాయి కూడా చెల్లించలేదు. అలాగే శ్రీశైలం నుంచి వచ్చిన సూపరింటెండెంట్ కన్నప్ప సదన్‌లో ఓ గదిని తన సొంతింటిలా మార్చుకున్నాడు. ప్రస్తుతం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ విభాగంలో పనిచేసే ఓ ఉద్యోగి డిప్యూటేషన్‌పై వచ్చి అతిథి గృహంలోనే ఉంటున్నాడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రూ.లక్షల్లో జీతాలు, హౌస్ అలవెన్సులు తీసుకునే వీరు ఆలయ అతిథి గృహాలను తమ సొంతింటిలా వాడుకోవడంపై పలు సార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినా చూసీ చూడనట్లు వదిలేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### అతిథి గృహంలో నూనె డబ్బాల నిల్వ

శ్రీకాళహస్తీశ్వరాలయ అతిథి గృహంలో ఖాళీ నూనె, నెయ్యి డబ్బాలను నిల్వ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భక్తుల వసతి గదుల్లో ఖాళీ అయిన నూనెడబ్బాలను నిల్వ చేయడంపై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరాలు వస్తున్నా అధికారులు పట్టించుకోని తీరుపై భక్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇటువంటి వాటిని నివారించి, భక్తులకు సాధ్యమైనంత వరకు గదులను అందుబాటులో ఉంచాలని వారు కోరుతున్నారు.



అతిథి గృహంలో ఉంచిన నెయ్యి డబ్బాలు

**తిష్ట వేసిన వారిని ఖాళీ చేయిస్తాం**

“ ఆలయ అతిథి గృహాల్లో తిష్టవేసిన వారిని ఖాళీ చేయిస్తాం. గతంలో వాడుకున్న ఇంజినీరింగ్‌శాఖ ఈఈకి అద్దె బకాయిల రికవరీకి చర్యలు తీసుకుంటాం. డబ్బాలను కూడా వేరే ప్రాంతానికి తరలించి, అన్ని వసతి గృహాలు భక్తులకు అందుబాటులో ఉండేలా సిద్ధం చేస్తాం.

\- ఈఓ బాపిరెడ్డి

## 21న క్రాస్ కంట్రీ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో ఈ నెల 21వ తేదీ ఉదయం 6గంటలకు క్రాస్ కంట్రీ అథ్లెటిక్ ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల బాలికలు, పురుషులు, మహిళల జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఆ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా అండర్–16 బాల బాలికలకు 2 కి.మీ, అండర్–18 బాల బాలికలకు 6 కి.మీ, అండర్–20 బాలబాలికలకు 8కి.మీ, పురుషులు, మహిళలకు 10 కి.మీ క్రాస్ కంట్రీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు నిర్దిష్ట సమయానికి హాజరు కావాలని , ఇతర వివరాలకు 86868 67079 నంబరులో సంప్రదించాలని కోరారు.

## 25 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

**సూళ్లూరుపేట:** పట్టణంలోని హోలీక్రాస్ సెంటర్ వద్ద 25 టన్నుల ఆంధ్రా, తమిళనాడు రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ డీటీ ఓబయ్య, పోలీస్ సిబ్బంది కలిసి దాడులు చేసి, స్వాధీనం చేసుకున్నారు. డీటీ కథనం మేరకు.. తమిళనాడులోని ఎళ్లావూరు నుంచి ఏపీ 27 వై 5525 నంబర్ లారీలో 600 బస్తాల తమిళనాడు రేషన్ బియ్యం, తడ మండలం రామాపురంలో 40 బస్తాలు ఆంధ్ర రేషన్ బియ్యం తీసుకుని వస్తున్నట్లు రెవెన్యూ, పోలీసు సిబ్బందికి ముందస్తు సమాచారం అందింది. దీంతో ఆ శాఖల అధికారులు సూళ్లూరుపేటలోని హోలీక్రాస్ వద్ద నిఘా పెట్టారు. ఆ సమయంలో నెల్లూరు వైపు వెళుతున్న ఓ లారీని ఆపి తనిఖీ చేశారు. అందులో 640 బస్తాల్లో 25 టన్నులు రేషన్ బియ్యం ఉన్నట్టుగా గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ ఎస్‌కే రఫీని అదుపులోకి తీసుకుని దీనికి యజమానులెవరని ప్రశ్నించగా వేనాటి భాస్కర్‌రెడ్డి, మణికంఠరెడ్డి అని చెప్పడంతో వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని నాయుడుపేట పౌరసరఫరాల గోడౌన్‌లో నిల్వ చేశామని డీటీ తెలిపారు. దీనిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### హత్యకేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

**శ్రీకాళహస్తి:** హత్యకేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణంలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నరసింహమూర్తి ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. పుల్లంపేటకు చెందిన ఎలక్ట్రీషియన్ ప్రభాకర్ అదృశ్యమైనట్లు ఆయన భార్య ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ గోపీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో ఏర్పేడు మండలం పల్లంపేటకు చెందిన వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, హేమంత్‌కుమార్‌లు కలిసి ప్రభాకర్‌ను హత్య చేసినట్లు పోలీసులు తమ విచారణలో గుర్తించారు. బుధవారం హత్యకేసులో నిందితులు వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, హేమంత్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించిన సీఐ గోపి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

### సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలు తెలపండి

**చిత్తూరు కలెక్టరేట్ :** చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీఈటీ కేడర్ల ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాల్లో అభ్యంతరాలుంటే తెలపాలని డీఈఓ వర లక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు, తి రుపతి జిల్లాల్లోని మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు,ఎస్జీటీ, పీఈటీలకు ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాను ఈ నెల 18వ తేదీన డీవైఈఓ, ఎంఈఓలకు పంపినట్లు పేర్కొన్నారు. ఆ జాబితాల్లో ఏవైనా పొరబాట్లు ఉంటే సంబంధిత ఆధారాలతో లిఖిత పూర్వకంగా ఈనెల 19వ తేదీ సాయంత్రంలోపు తెలియజేయాలన్నారు. అనంతరం వచ్చే అభ్యంతరాలను స్వీకరించమన్నారు.

### ఇంట్లో దూరి...కంట్లో కారం కొట్టి...

- మహిళ మెడలో చైన్ స్నాచింగ్

**తిరుపతి రూరల్:** దోపిడీ దొంగలు పట్టపగలే ఓ ఇంట్లోకి దూరి.. మహిళ కంట్లో కారం కొట్టి ఆమె మెడలోని బంగారు చైన్‌ను తెంచుకుని వెళ్లిన ఘటన బుధవారం తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీలో చోటుచేసుకుంది. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. అవిలాల వాణీనగర్‌కు చెందిన నాగస్వాతి ఉదయం పిల్లలను స్కూల్లో దింపి, ఇంటికి వచ్చింది. తలకు, ముఖానికి ముసుగులు వేసుకున్న ఓ మహిళ, మరో వ్యక్తి నాగస్వాతి వెనుకే ఆమె ఇంట్లోకి దూరారు. కారం పొడిని నాగస్వాతి కంట్లో కొట్టి, ఆమె మెడ లోని 24 గ్రాముల బంగారు చైన్‌ను బలవంతంగా తెంచుకుని వెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### శాస్త్రీయ విధానాలతో అధిక లాభాలు



శిక్షణలో ఔత్సాహికులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

**తిరుపతి సిటీ :** శాస్త్రీయ పరిజ్ఞానంతో నిర్దేశిత పద్ధతుల ఆధారంగా సీమ పందుల పెంపకం చేపట్టిన ఔత్సాహికులకు అధిక లాభార్జన పొందే అవకాశం ఉంటుందని వెటర్నరీ వర్సిటీ పరిశోధక సంచాలకులు డాక్టర్ శోభ పేర్కొన్నారు. వెటర్నరీ వర్సిటీ నిరంతర విద్యా సమాచార కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజులుగా శాస్త్రీయ పద్ధతులలో సీమ పందుల పెంపకంపై ఔత్సాహిక యువత, రైతులకు జరిగిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రీయ పద్ధతులలో పందుల పెంపకం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, విభాగాధిపతి డాక్టర్ విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు

### శ్రీవారి దర్శనానికి 12 గంటలు

**తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 11 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 63,598 మంది స్వామి వారిని దర్శించుకోగా 20,102 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.59 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం కలిగిస్తున్నారు. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

### చోరీ కేసులో నిందితుడికి జైలు

**తిరుపతి లీగల్:** బంగారు నగల చోరీ కేసులో గుంటూరు, పొరవాయగుంటకు చెందిన తిరువేదుల మహేష్‌కు ఆరు నెలలు జైలుశిక్ష విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్‌ వై సరిత బుధవారం తీర్పు చెప్పారు. 2022 అక్టోబర్ 26 నుంచి 31వ తేదీ లోపు తిరుపతి రూరల్, శ్రీనివాసపురానికి చెందిన రిటైర్డ్ టీటీడీ ఉద్యోగి నాగేశ్వరరావు ఇంట్లో 176 గ్రాముల బంగారు నగలు అపహరణ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుపతి సీసీఎస్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి, నిందితుడు మహేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

**బెదిరించిన వ్యక్తికి రిమాండ్**

తిరుపతి– రేణిగుంట మార్గంలోని చదలవాడ నగర్ వద్ద ఉన్న ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్‌లోకి అక్రమంగా ప్రవేశించి విధి నిర్వహణలోని బ్యాంక్ అప్రైజర్‌ను డబ్బు ఇవ్వాలంటూ బెదిరించిన కేసులో వరదయ్యపాళెం మండలం, సాధనవారిపల్లెకు చెందిన పి. పురుషోత్తం అనే వ్యక్తికి ఈనెల 31వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత బుధవారం ఆదేశాలు జారీ చేశారు. తిరుచానూరు పోలీసులు నిందితుడు పురుషోత్తంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

# పోలీస్ సేవలు ఇక సులభతరం

- పోలీసు శాఖ వెబ్‌సైట్ సేవలు ప్రారంభం



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

**తిరుపతి క్రైం:** జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆధునీకరించిన కొత్త పోలీస్ వెబ్‌సైట్‌ను జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సౌలభ్యం కోసం , సిటిజన్ ఫ్రెండ్లీ వెబ్‌సైట్‌ను ప్రారంభించామన్నారు. ఈ వెబ్‌సైట్‌తో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజాసేవల కోసం మెరుగైన ఫలితాలు అందించే దిశగా అడుగు ముందుకు వేస్తామన్నారు. ఈ వెబ్‌సైట్ ప్రజల కోసం, వారి సౌలభ్యం కోసం ప్రాధాన్యతగా రూపొందించామని, పౌరులు పోలీస్ సేవల కోసం వెబ్‌సైట్ https://Tirupatipolice.ap.gov.in యాక్సెస్ చేయవచ్చన్నారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్(ఎన్‌ఐసీ) వారి సహకారంతో తిరుపతి జిల్లా పోలీసులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పోలీసుల వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ప్రజలకు మరింత దగ్గరగా కావడానికి, పోలీస్ సేవలను ప్రజలు తెలుసుకోవడానికి ఈ వెబ్‌సైట్ ఉపయోగపడుతుందన్నారు. రాబోయే కాలంలో ఈ వెబ్‌సైట్ ద్వారా ఇంకా మెరుగైన సేవలను అందించి, ప్రజలకు మరింత దగ్గరగా కావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటరావు, ఎస్.వెంకటేశ్వర్‌రావు జాయింట్ డైరెక్టర్ (ఐటీ), బీకే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**మొబైల్ హంట్‌తో 435 సెల్‌ఫోన్ల రికవరీ**

మొబైల్ హంట్‌తో రూ.87 లక్షల విలువ చేసే 435 సెల్ ఫోన్లు రికవరీ చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడించారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి జిల్లా పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి కోసం ప్రత్యేకంగా జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన 'మొబైల్ హంట్' (పోలీస్ వాట్సాప్ నంబర్ 9490617873) అప్లికేషన్‌లకు వచ్చిన ఫిర్యాదులపై గతంలో రూ.6,69,40,000 విలువ చేసే 3840 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. తాజాగా పదో విడతలో ప్రస్తుతం 435 సెల్‌ఫోన్లను సైబర్ క్రైమ్ పోలీసులు రికవరీ చేశారన్నారు. ప్రధానంగా తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు మొబైల్ పోగొట్టుకుంటున్నారని, అలాగే కొన్ని చోరీకి గురవుతున్నాయని తెలిపారు. అలాంటి వారంతా 'మొబైల్ హంట్' కు హాయ్ అని మెస్సేజ్ చేస్తే లింకు వస్తుందని, అందులో వారి వివరాలను పూర్తి చేయాలన్నారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్)లో ఇది నమోదవుతుందన్నారు. సెల్‌ఫోన్‌లో ఉన్న సమాచారం దుర్వినియోగం కాకుండా ఆ ఫోన్ బ్లాక్ అవుతుందన్నారు. దాని ద్వారానే సెల్‌ఫోన్లను త్వరగా రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. రికవరీ చేసిన మొబైళ్లన్నీ ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రం నుంచి తీసుకొచ్చామన్నారు. సెల్‌ఫోన్ల దుకాణాల యజమానులు, నిర్వాహకులు అజ్ఞాత వ్యక్తుల నుంచి సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేయకూడదన్నారు. కేసును ఛేదించడంలో ఏఎస్పీ వెంకట్రావు, సైబర్ సీఐ వినోద్‌కుమార్, సిబ్బంది ఎంతగానో కృషి చేశారన్నారు. అనంతరం సైబర్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి, అభినందించారు.

## స్థానిక ఆలయాల్లో పెద్దజీయర్‌కి పెద్ద మర్యాద



శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో పెద్దజీయర్ స్వామికి పెద్ద మర్యాద చేస్తున్న అర్చకులు, అధికారులు

**తిరుపతి కల్చరల్:** పెరియ కోయిల్ కేల్వియప్పన్ శఠగోప రామానుజ పెద్దజీయర్‌స్వామివారికి బుధవారం టీటీడీ స్థానిక ఆలయాల్లో వేడుకగా పెద్ద మర్యాద చేశారు. ఇందులో భాగంగా శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో స్వామిజీకి టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఎఫ్ఏ అండ్ సీఏఓ బాలాజీ, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీకోదండరామస్వామివారి ఆలయాలకు విచ్చేసిన స్వామీజీ సంప్రదాయం ప్రకారం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆలయాల డిప్యూటీ ఈఓలు గోవిందరాజన్, శాంతి, నాగరత్నం, తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు చిన్నారులకు విముక్తి

**చైల్డ్ హోమ్‌కు తరలించిన పోలీసులు**



ఐసీడీఎస్ అధికారులకు అప్పజెప్పుతున్న పోలీసులు

**వాకాడు:** మండలంలో పలు ప్రాంతాల్లో బాల కార్మికులుగా వెట్టిచాకిరి చేస్తున్న నలుగురు చిన్నారులకు బుధవారం పోలీసులు విముక్తి కలిగించారు. వాకాడు ఎస్‌ఐ నాగబాబు కథనం మేరకు.. వాకాడు మండలం పులింజేరివారిపాళెంలో నివాసం ఉంటున్న ఇరగరాజు పద్మ అనే మహిళకు చెంచుకృష్ణ(15) రాఘవ(10) అనే ఇద్దరు మగ పిల్లలు, పల్లవి(11), భూమిక(6) అనే మరో ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. అయితే తల్లి పద్మ వ్యసనాలకు బానిసై పిల్లలను విద్యకు దూరం చేసి, వివిధ ప్రాంతాల్లోని రొయ్యల చెరువుల వద్ద, అలాగే వివిధ పనుల నిమిత్తం కొందరు ఆసాముల వద్ద కొంత అడ్వాన్సు తీసుకుని వారికి అప్పజెప్పింది. నెల నెలా ఆసాముల వద్ద నుంచి అవసరాల నిమిత్తం కొంత డబ్బు తీసుకుంటూ పిల్లల బాగోగులు పట్టించుకోకుండా వెళ్లిపోతుంది. వెట్టి చాకిరి చేస్తున్న చిన్నారులను వాకాడు ఎస్‌ఐ నాగబాబు గుర్తించి, అదుపులోకి తీసుకుని, వారి విచారించి ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు పిల్లలతోపాటు తల్లి పద్మను విచారించారు. తల్లి పద్మ వద్దకు తాము వెళ్లమని పిల్లలు చెప్పడంతో వారిని నెల్లూరు చైల్డ్ హోమ్‌కు తరలించారు. చిన్నారులకు విముక్తి కలిగించిన ఎస్‌ఐ నాగబాబుని పలువురు అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సీపీఓ సీహెచ్ సమత, గూడూరు అట్రాసిటీ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యత రంగాలకు రుణాలు ఇవ్వండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి అర్బన్:** ప్రాధాన్యత రంగాలకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతోపాటు అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్య, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాలకు రుణాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని చెప్పారు. జిల్లా ప్రజలకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం విశ్వనాథరెడ్డి, ఆర్బీఐ ఎల్‌డీఓ పూర్ణిమ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ జి.రాంప్రసాద్, డీఏఓ ప్రసాద్‌రావు, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, నాబార్డ్ డీడీఎం సునీల్, మెప్మా పీడీ రవీంద్ర, డీడీ డీఐసీ మారుతి ప్రసాద్, పీడీ ఏపీఎంఐపీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**హాస్టళ్ల మరమ్మతుకు నిధుల మంజూరు**

తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని 55 హాస్టల్ భవనాల మరమ్మతుకు రూ.6.34 కోట్లు మంజూరు చేశారని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో హాస్టళ్ల అధికారులతోపాటు ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో మరుగుదొడ్ల మరమ్మతుతోపాటు అందులో రన్నింగ్ వాటర్ ఉండేలా చూడాలన్నారు. గదుల్లో వైరింగ్, ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు, కిటికీలకు దోమల మెష్, గదులకు తలుపులు, ఫ్లోరింగ్, బాలికల వసతి గృహాలకు కాంపౌండ్ వాల్‌కు తదితర సౌకర్యాల కల్పనకు ఆ నిధులు ఖర్చు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, బాల సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

**తిరుపతి లీగల్:** ఎర్రచందనం చెట్లను నరికి దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో తమిళనాడు, ధర్మపురి జిల్లా, ఆరూరు తాలూకా, నమ్మం గాడి గ్రామానికి చెందిన పి.పళనిస్వామికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు జడ్జి నరసింహమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2018 అక్టోబర్ 15వ తేదీ కడప డివిజన్, సిద్ధవటం రేంజ్, బంగ్లా బావి బేస్ క్యాంపు, చంచల చెలిమి అటవీ ప్రాంతంలోకి 11 మంది అక్రమంగా ప్రవేశించి, ఎర్రచందనం చెట్లను నరుకుతుండగా సిద్దవటం ఫారెస్ట్ అధికారులు వారిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించారు. అయితే పదిమంది అక్కడి నుంచి పరారయ్యారు. నిందితుడు పళనిస్వామిని మాత్రం ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆ ప్రాంతంలోని 200 కిలోల 11 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఫారెస్ట్ అధికారులు నిందితుడు పళనిస్వామిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.